అక్టోబర్ 15లోపు ఆలయ నిర్మాణ పనులు పూర్తి

అయ్యప్ప ఆలయ నిర్మాణ పనులను పరిశీలిస్తున్న స్థపతి డాక్టర్ మోతీలాల్

కోటగిరి, జూలై 17: మండల కేంద్రంలో నూతనంగా నిర్మిస్తున్న శ్రీ అయ్యప్ప, సాయిబాబా ఆలయ నిర్మాణ పనులు అక్టోబర్ 15లోపు పూర్తవుతాయని యాదాద్రి ఆలయ స్థపతి డాక్టర్ మోతీలాల్ అన్నారు. బుధవారం ఆయన ఆలయ నిర్మాణ పనులను పరిశీలించారు. పనులు త్వరగాపూర్తిచేయాలని సూచించారు. నవంబర్‌లో నిర్వహించనున్న విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవానికి ఏర్పాట్లు చేస్తున్నామని ఆలయ స్థల దాత, వ్యవస్థాపకుడు పోల విఠల్‌రావు గుప్తా తెలిపారు. స్థపతి వెంట ఇషాంత్ గుప్తా, బర్ల సత్యనారయణ, శానం సాయిలు, సూదం శంకర్, నాగేశ్వర్‌రావు, నాగరాజు తదితరులు ఉన్నారు.

బాల్య స్నేహితుడి కుటుంబానికి చేయూత

బాధిత కుటుంబానికి నగదును అందజేస్తున్న పూర్వ విద్యార్థులు

జక్రాన్‌పల్లి, జూలై 17 : ఆపదలో ఉన్న బాల్య మిత్రుడి కుటుంబానికి స్నేహితులు చేయూతనందించారు. మండలంలోని అర్గుల్ గ్రామానికి చెందిన షాదుల్లా గతేడాది గుండెపోటుతో మృతి చెందాడు. బాధిత కుటుంబానికి షాదుల్లాతో కలిసి జడ్పీహెచ్ఎస్‌లో పదో తరగతి (1997-98) వరకు చదువుకున్న స్నేహితులు అండగా నిలిచారు. షాదుల్లా కుటుంబం దీన స్థితిలో ఉన్నదని తెలుసుకుని బుధవారం రూ.37,500 ఆర్థిక సాయం అందజేశారు. అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో చింత మహేశ్, సంఘం మహిపాల్, పెద్ది రాజు, ప్రవీణ్‌కుమార్, బేల్దారి గంగాధర్ పాల్గొన్నారు.

ఆదివాసీ దినోత్సవంలో పాల్గొనాలి

ఖలీల్‌వాడి, జూలై 17: ఆగస్టులో నిర్వహించే ఆదివాసీ దినోత్సవంలో జిల్లా నుంచి నృత్య ప్రదర్శన ఏర్పాటు చేయాలని ఆదివాసీ నాయక్‌పోడ్ సేవా సంఘం జిల్లా అధ్యక్షుడు గాండ్ల లింగం అన్నారు. బుధవారం ఆర్మూర్ పట్టణంలోని పెర్కిట్ వద్ద నిర్వహించిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. పరేడ్‌గ్రౌండ్‌లో జరిగే సంబురాల్లో నాయక్‌పోడ్ నృత్యాలను ప్రదర్శించాలని తీర్మానించినట్లు తెలిపారు. సమావేశంలో ప్రధాన కార్యదర్శి గంగసాయన్న, కార్యనిర్వహణ అధ్యక్షుడు గంగాధర్, కోశాధికారి పవన్ కుమార్, కార్యదర్శులు అశోక్, పోశెట్టి పాల్గొన్నారు.

ట్రాక్టర్ బోల్తా .. యువకుడి మృతి

బాల్కొండ, జూలై 17: మండలంలోని నాగాపూర్‌కు చెందిన బొమ్మిడ పృథ్వీరాజ్ (19) ప్రమాదవ శాత్తు ట్రాక్టర్ కింద పడి బుధవారం మృతి చెందినట్లు ఎస్సై యాస్పీర్ ఆర్పాత్ తెలిపారు. ఎస్సై కథనం ప్రకారం.. పృథ్వీరాజ్ తన భార్య, తండ్రి పురుషోత్తంతోపాటు వ్యవసాయ పనులకు వెళ్తుంటాడు. మధ్యాహ్నం 2 గంటల సమయంలో ఎస్సారెస్పీ బ్యాక్‌వాటర్‌లో ట్రాక్టర్‌ను వాషింగ్ (కడిగేందుకు)కు తీసుకెళ్తున్నాడు. అతివేగం, అజాగ్రత్తగా నడపడంతో గ్రామ శివారులోని నాగలింగే శ్వర ఆలయం వద్ద ట్రాక్టర్ అదుపు తప్పి బోల్తా పడింది. కాసేపటికి పురుషోత్తం చిన్నాన్న దేవిదాస్ సంఘటన సమాచారాన్ని పురుషోత్తంకు తెలిపాడు. మృతుడి తండ్రి అక్కడికి వెళ్లి చూడగా ట్రాక్టర్ కింద పృథ్వీరాజ్ తీవ్ర గాయాలతో మృతి చెంది ఉన్నాడు. తండ్రి ఫిర్యాదు మేర కు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. పండుగ పూట ఒక్కగానొక్క కొడుకు మృతి చెందడంతో కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరుగా విలపించారు.

బ్యాంకు ఖాతా నుంచి డబ్బులు మాయం

నందిపేట్, జూలై 17: డొంకేశ్వర్ మండలం గంగాసముందర్ గ్రామానికి చెందిన గుండేటి ముత్యంరెడ్డి సైబర్ నేరగాళ్ల చేతిలో మోసపోయాడు. ఆగస్టులో జరగనున్న తన కూతురి పెండ్లి కోసం బ్యాంకు ఖాతాలో దాచుకున్న డబ్బులను సైబర్ నేరగాళ్లు స్వాహా చేశారు. యూనియన్ బ్యాంకు నూత్‌పల్లి బ్రాంచిలోని ముత్యంరెడ్డి అకౌంట్ నుంచి రూ.4 లక్షల 16 వేల 800 నేరగాళ్లు మాయం చేశారు. ముత్యంరెడ్డి వాట్సప్‌కు ఐదు రోజుల క్రితం యూనియన్ బ్యాంకు పేరిట లింక్ వచ్చింది. ఆ లింక్‌ను ఓపెన్ చేయడంతో వరుసగా నాలుగు ఓటీపీలు వచ్చాయని, మరుసటి రోజు బ్యాంకు ఖాతాల నుంచి నాలుగు దఫాలుగా డబ్బులు డ్రా అయినట్లు మెస్సేజ్‌లు వచ్చాయని బాధితుడు తెలిపారు. నాలుగు దఫాలుగా రూ.4,16,800 తన బ్యాంకు ఖాతాలో నుంచి కాజేశారని బాధితుడు నందిపేట్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేశారు.

వెల్డింగ్‌షాప్‌లో చోరీ

శక్కర్‌నగర్, జూలై 17: బోధన్‌లోని శక్కర్‌నగర్ చౌరస్తాలో జమీర్ అనే వ్యక్తికి చెందిన వెల్డింగ్‌షాప్‌లో దొంగలు చోరీకి పాల్పడ్డారు. బోధన్- నిజామాబాద్ ప్రధాన రహదారి పక్కనే ఉన్న షెడ్డులో జమీర్ వెల్డింగ్ షాప్‌ను నిర్వహిస్తున్నాడు. ఈనెల 16న సాయంత్రం దుకాణానికి తాళాలు వేసి ఇంటికి వెళ్లాడు. బుధవారం ఉదయం వచ్చి చూడగా షెట్టర్ తాళం పగులగొట్టి ఉంది. బోధన్ టౌన్ సీఐ సండ్ర వీరయ్య సిబ్బందితో వచ్చి పంచనామా జరిపారు. దుకాణంలోని ప్రధాన వస్తువులను దొంగలు ఎత్తుకెళ్లారని బాధితుడు పోలీసులకు వెల్లడించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

గుంతల రోడ్లు.. నగరవాసులకు ఇబ్బందులు

- కానరాని మరమ్మతులు
- పట్టించుకోని అధికారులు

ఉమెన్స్ కళాశాల వద్ద రోడ్డుపై నిలిచిన వర్షపు నీరు

ప్రభాత్ థియేటర్ వద్ద రోడ్డుపై ఏర్పడిన గుంతలు

కంఠేశ్వర్, జూలై 17: నగరంలోని రోడ్లు అధ్వానంగా మారాయి. ఎక్కడ చూసినా రోడ్లపై గుంతలు దర్శనమివ్వడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అసలే వర్షాకాలం.. రోడ్లపై అడుగడుగున ఏర్పడిన గుంతలతో అవస్థలు పడుతున్నారు. ఇప్పుడే ఇలా ఉంటే భారీ వర్షాలు కురిస్తే పరిస్థితి ఎలా ఉంటుందోనని ఆందోళన చెందుతున్నారు. గుంతల్లో నీరు నిల్వ ఉండడంతో వాహనదారులు తరచూ ప్రమాదాలకు గురవుతున్నారు. నగరంలోని లలితామహల్ థియేటర్ నుంచి దుబ్బ, ముబారక్‌నగర్, మహిళా కళాశాల, గంగాస్థాన్ ఫేజ్-2, సాయినగర్, వినాయక్‌నగర్, ఆర్యనగర్ తదితర ప్రాంతాల్లో రోడ్లన్నీ గుంతలమయంగా మారాయి. కొన్నిచోట్ల కంకర తేలడంతో పాదాచారులు నరకయాతన అనుభవిస్తున్నారు. నగరంలోని 60 డివిజన్లలో ఇప్పటివరకు రోడ్ల మరమ్మతులు చేపట్టకపోవడం గమనార్హం. చిన్నపాటి వాన కురిసినా రోడ్లపై తిరగలేని పరిస్థితి నెలకొన్నది. పలుచోట్ల అండర్ గ్రౌండ్ డ్రైనేజీ మురికినీరు రోడ్లపై ఏర్పడిన గుంతల్లో చేరడంతో దుర్గంధం వ్యాపిస్తోందని స్థానికులు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. వర్షాకాలానికి ముందే రోడ్ల మరమ్మతులు చేపట్టాల్సిన యంత్రాంగం పట్టించుకోవడంలేదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. నగర శివారులోని కాలనీల్లో రోడ్ల పరిస్థితి మరింత దారుణంగా మారింది. ఇప్పటికైనా నగరపాలక సంస్థ అధికారులు స్పందించి రోడ్లపై ఉన్న గుంతలను పూడ్చి, మరమ్మతులు చేపట్టాలని నగరవాసులు కోరుతున్నారు. రోడ్ల మరమ్మతులపై మున్సిపల్ ఇంజినీర్‌ను సంప్రదించగా టెండర్లు పూర్తయ్యాయని, త్వరలోనే పనులను ప్రారంభిస్తామని తెలిపారు.

భక్తిశ్రద్ధలతో తొలి ఏకాదశి

- ఆలయాల్లో ప్రత్యేక పూజలు, అభిషేకాలు
- గోవింద నామస్మరణతో మార్మోగిన మందిరాలు

సుభాష్‌నగర్/ఇందల్వాయి/ రుద్రూర్/ధర్పల్లి/కోటగిరి/బోధన్/ ఆర్మూర్‌టౌన్/ ఏర్గట్ల/ బోధన్ రూరల్, జూలై 17: జిల్లాలో తొలిఏకాదశి పర్వదినాన్ని బుధవారం భక్తిశ్రద్ధలతో జరుపుకొన్నారు. తొలి ఏకాదశి సందర్భంగా జిల్లాలోని ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. నగరంలోని జెండా బాలాజీ మందిరం, రైల్వే స్టేషన్‌రోడ్ గీతా మందిరం, శివాజీ నగర్ కృష్ణ మందిరం, నాందేవ్‌వాడ విఠలేశ్వర మందిరం, దత్త మందిరాల్లో విశేష పూజలు, అర్చనలు కొనసాగాయి. ఉదయం నుంచే భక్తులు ఆలయాలకు బారులు తీరారు. నాందేవ్‌వాడలోని విఠలేశ్వరాలయంలో ఉదయం 4 గంటల నుంచే పంచామృతాభిషేకం, పుష్పపూజ, అలంకరణ పూజలు చేశారు. ధూప దీప నైవేద్యాలు సమర్పించారు. తొలి ఏకాదశి ప్రాశస్త్యాన్ని బడా రాంమందిరం శ్యాం మహరాజ్ వివరించారు. ఆషాఢ శుద్ధ ఏకాదశి నుంచి నాలుగు నెలలు చతుర్మాస దీక్ష ఉంటుందని ఈ సమయంలో దీక్షధారులు చింతపండు, వెల్లుల్లి, ఉల్లి, దుంపకూరలు తీసుకోవద్దని సూచించారు. పలు ఆలయాల్లో భక్తులకు పండ్లు పంపిణీ చేశారు. గీతా మందిరాల్లో సామూహిక విష్ణు సహస్రనామ పారాయణం చేశారు. గోవింద నామస్మరణతో ఆలయాలు మార్మోగాయి. మాక్లూర్ మండల కేంద్రంలోని రుక్మిణీ పాండు రంగ విఠలేశ్వర ఆలయంలో అర్బన్ మాజీ ఎమ్మెల్యే బిగాల గణేశ్‌గుప్తా ప్రత్యేక పూజలు నిర్వహించారు. పలు ఆలయాల్లో గురువారం ప్రత్యేక పూజలు, అన్నదాన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ ప్రతినిధులు తెలిపారు.

నగరంలోని విఠలేశ్వర మందిరంలో భక్తుల విశేష పూజలు

మాక్లూర్‌లోని రుక్మిణీ పాండురంగ విఠలేశ్వరాలయంలో అర్బన్ మాజీ ఎమ్మెల్యే బిగాల పూజలు

బోధన్‌లోని శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో నిర్వహించిన పూజా కార్యక్రమాల్లో పాల్గొన్న భక్తులు

కోటగిరి శ్రీవిఠలేశ్వర మందిరంలో పూజలు చేస్తున్న భక్తులు

ఆర్మూర్ పట్టణంలోని వేంకటేశ్వర స్వామి ఆలయంలో..

పాఠశాల పనుల పరిశీలన

పాఠశాల పనులను పరిశీలిస్తున్న అర్బన్ మాజీ ఎమ్మెల్యే గణేశ్ బిగాల

మాక్లూర్, జూలై17: మండల కేంద్రంలో ప్రభుత్వ ఉన్నత పాఠశాల భవన నిర్మాణ పనులను అర్బన్ మాజీ ఎమ్మెల్యే బిగాల గణేశ్ గుప్తా బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన గ్రామస్తులతో మాట్లాడుతూ ఈ పాఠశాల భవన నిర్మాణానికి తెలంగాణ తొలి సీఎం కేసీఆర్ గతంలో రూ.5.70 కోట్లు మంజూరు చేయగా తన నాన్న బిగాల కృష్ణమూర్తి జ్ఞాపకార్థం రూ.కోటి విరాళంగా బిగాల బ్రదర్స్ ఇచ్చినట్లు గుర్తు చేశారు. ఆభవనం పూర్తయితే విద్యార్థులకు ఎంతో సౌకర్యంగా ఉంటుందని అన్నారు. రాష్ట్రంలోని టాప్ ఐదు ప్రభుత్వ పాఠశాలల్లో ఇది ఒకటని ఆయన పేర్కొన్నారు.

ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలి

మందర్నలో మొక్కలు నాటుతున్న ఎస్సై నాగనాథ్

బోధన్ రూరల్, జూలై17: సాలూర మండలంలోని మందర్న గ్రామంలో బుధవారం పోలీసు శాఖ ఆధ్వర్యంలో వన మహోత్సవంలో భాగంగా మొక్కలు నాటారు. బోధన్ రూరల్ ఎస్సై నాగనాథ్ మాట్లాడుతూ.. 500 మొక్కలను నాటినట్లు ఆయన తెలిపారు. వన మహోత్సవ కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని కోరారు. పోలీసు సిబ్బంది, గ్రామస్తులు ఉన్నారు.

పుస్తకావిష్కరణ

ఆర్మూర్‌టౌన్, జూలై17: మండలంలోని అంకాపూర్ గ్రామంలోని తన స్వగృహంలో ఎమ్మెల్యే పైడి రాకేశ్‌రెడ్డి బుధవారం ఓ భారతీయుడా అనే పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ భారత్ సురక్ష సమితి హైదరాబాద్ ఆధ్వర్యంలో ఎమర్జెన్సీ 1975/1977 గురించి ఇందులో వివరించారని తెలిపారు. ఎమర్జెన్సీ సమయంలో జైలుకు వెళ్లి వచ్చిన వారిని సన్మానించారు.

పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే పైడి రాకేశ్‌రెడ్డి

మాజీ ఎంపీపీకి సన్మానం

నందిపేట్, జూలై 17: పదవీ విరమణ పొందిన మాజీ ఎంపీపీ వాకిడి సంతోష్‌రెడ్డిని ఆయన స్వగ్రామం వన్నెల్(కె)లో గ్రామస్తులు, ఆశ కార్యకర్తలు, ఆయా పార్టీల నాయకులు బుధవారం సన్మానించారు. వారు మాట్లాడుతూ గ్రామాభివృద్ధికి ఎంతో తోడ్పాటునందించారని అన్నారు.

సన్మాన సభకు తరలిరావాలి

భీమ్‌గల్, జూలై 17: రాష్ట్రస్థాయి కార్పొరేషన్ పదవులు పొందిన ఈరవత్రి అనిల్‌కుమార్, మానాల మోహన్‌రెడ్డి, సుంకెట్ అన్వేశ్‌రెడ్డి, తాహెర్‌బిన్ హందాన్‌ను శుక్రవారం మండల కేంద్రంలో సన్మానించనున్నట్లు పార్టీ మండల అధ్యక్షుడు బొదిరె స్వామి తెలిపారు. బుధవారం ఆయన మండల కేంద్రంలో విలేకరులతో మాట్లాడారు. బాల్కొండ నియోజకవర్గంలోని ఎనిమిది మండలాల పార్టీ అధ్యక్షులు, జిల్లా కార్యవర్గ సభ్యులతో ప్రత్యేక సమావేశం నిర్వహించనున్నట్లు తెలిపారు.

నిధుల మంజూరుకు కృషి చేస్తా

ఆర్మూర్‌టౌన్, జూలై17: చేపూర్ గ్రామంలో శిథిలావస్థకు చేరిన ప్రభుత్వ పాఠశాలను బుధవారం కాంగ్రెస్ ఆర్మూర్ నియోజకవర్గ ఇన్‌చార్జి వినయ్‌రెడ్డి పరిశీలించారు. సంబంధిత మంత్రి దృష్టికి తీసుకెళ్లి నిధుల మంజూరుకు కృషి చేస్తానన్నారు.

జీవితంపై విరక్తి చెంది ఆత్మహత్య

నవీపేట, జూలై 17: జీవితంపై విరక్తి చెంది మండలంలోని అబ్బాపూర్(బి) గ్రామానికి చెందిన నేనావత్ వినోద్ (32) బుధవారం పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడినట్లు ఎస్సై యాదగిరిగౌడ్ తెలిపారు. ఎస్సై కథనం ప్రకారం.. వినోద్ కొన్ని నెలల క్రితం బతుకుదెరువు కోసం గల్ఫ్ వెళ్లారు. అక్కడ వేతనం సరిగా లేకపోవడంతో కొన్ని రోజుల క్రితం స్వదేశానికి తిరిగి వచ్చాడు. అప్పులు ఎలా తీర్చాలో తెలియక జీవితంపై విరక్తితో ఈనెల 16న పరుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నం చేశాడు. కుటుంబసభ్యులు చికిత్స నిమిత్తం నిజామాబాద్ దవాఖానకు తరలించారు. పరిస్థితి విషమించి బుధవారం మృతి చెందాడు. మృతుడికి కూతురు, కుమారుడు ఉన్నారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై చెప్పారు.

ఘనంగా మొహర్రం

మోర్తాడ్/శక్కర్‌నగర్/ఆర్మూర్‌టౌన్/రెంజల్/సుభాష్‌నగర్/రుద్రూర్/డిచ్‌పల్లి/ధర్పల్లి/జక్రాన్‌పల్లి,జూలై17:జిల్లాలో ముస్లింలు బుధవారం మొహర్రం పండుగను భక్తిశ్రద్ధలతో జరుపు కొన్నారు. జిల్లా కేంద్రంలోని పాములబస్తీ, బోయి గల్లి, ఉప్పర్‌టేక్‌డీలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. పీర్లను ఊరేగింపు నిర్వహించి సమీపంలోని బోర్గాం, జాన్కంపేట చెరువుల్లో నిమజ్జనం చేశారు. రుద్రూర్‌లో పీర్ల వద్ద భక్తులకు షర్బత్ పంపిణీ చేశారు. బోధన్ పట్టణంలోని రెంజల్‌బేస్, పాన్‌గల్లీ, శక్కర్‌నగర్ తదితర ప్రాంతాల్లో పీరీలతో ఊరేగించారు. మోర్తాడ్ మండలంలో గాండ్లపేట్, తిమ్మాపూర్, ఆర్మూర్‌లోని హుసెనాబాద్ కాలనీ, రెంజల్ మండలంలోని రెంజల్, వీరన్నగుట్ట, సాటాపూర్, బోర్గాం, తాడ్‌బిలోలి, నీలా,. డిచ్‌పల్లి, ఇందల్వాయి, జక్రాన్‌పల్లి మండలాల్లో పీరీల ఊరేగింపు చేపట్టారు. ధర్పల్లి, సీతాయిపేట్, రామడ్గు, దుబ్బాక తదితర గ్రామాల్లో పండుగను నిర్వహించారు. పీర్లను చెరువుల్లోకి నిమజ్జనానికి తరలించారు.

తిమ్మాపూర్‌లో పీరీలను ఊరేగింపు..

శక్కర్‌నగర్‌లో పీరీలను ఊరేగిస్తున్న భక్తులు

జక్రాన్‌పల్లి మండల కేంద్రంలో మొహర్రం వేడుకలు

డిచ్‌పల్లిలో..

రుణమాఫీ నిబంధనలను సవరించాలి

ఖలీల్‌వాడి, జూలై 17: రాష్ట్ర ప్రభుత్వం రైతు రుణమాఫీ కోసం ఇచ్చిన మార్గదర్శకాల్లోని అనేక నిబంధనల మూలంగా అర్హులైన పేద, మధ్యతరగతి రైతులు రుణమాఫీకి దూరమయ్యే పరిస్థితులున్నాయని, వాటిని సవరించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి రమేశ్‌బాబు కోరారు. రూ. రెండు లక్షలకుపైగా అప్పులు ఉన్న రైతులు ముందుగా వాటిని చెల్లించిన తర్వాతే రుణమాఫీ చేస్తామని చెప్పడం సరి కాదని, దీంతో రైతులు నష్టపోయే ప్రమాదం ఉందని పేర్కొన్నారు. ముందుగా రూ. 2 లక్షల రుణమాఫీ చేయాలని, పంటలు వచ్చిన తర్వాతే రైతులు డబ్బులు చెల్లించేలా ఆదేశాలు ఇవ్వాలని సూచించారు.

రెండు లక్షల రుణాలను మాఫీ చేయాలి

ఖలీల్‌వాడి, జూలై 17 : కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు రూ. 2 లక్షల రుణమాఫీ చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి సుధాకర్ డిమాండ్ చేశారు. బుధవారం ఆయన పార్టీ జిల్లా కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. క్రాప్‌లోన్, వ్యవసాయ పనుల నిమిత్తం బంగారం తాకట్టు పెట్టి బ్యాంకుల్లో తీసుకున్న రుణాలు కూడా మాఫీ చేయాలని కో రారు. సీపీఐ జిల్లా నాయకులు ఎ.విఠల్‌గౌడ్, బి. రఘురాం, రంజిత్, గంగాధర్ పాల్గొన్నారు.

పోరాటాల ఫలితంగానే వేతనాలు విడుదల

సిరికొండ, జూలై 17 : దశలవారీగా పోరాటాలు చేయడంతోనే ప్రభుత్వం గ్రామపంచాయతీ కార్మికుల వేతనాలను విడుదల చేసిందని ఐఎఫ్‌టీయూ జిల్లా కార్యదర్శి రమేశ్ అన్నారు. బుధవారం ఆయన మండల కేంద్రంలో విలేకరులతో మాట్లాడారు. పెండింగ్ వేతనాలు, సమస్యల పరిష్కారం కోసం వివిధ ఉద్యమాలు, పోరాటాలు నిర్వహించినట్లు తెలిపారు. ఇకపై కార్మికులకు ఏ సమస్య ఉన్నా ఇదే స్ఫూర్తితో ఉద్యమాలు చేస్తామన్నారు. సమావేశంలో దామోదర్, సాయిరెడ్డి, రమేశ్, కిశోర్ పాల్గొన్నారు.

నేడు రైతువేదికల్లో సంబురాలు

ఖలీల్‌వాడి, జూలై 17: రుణమాఫీ సంబురాలు రైతువేదికల్లో గురువారం నిర్వహించనున్నట్లు జిల్లా వ్యవసాయశాఖ అధికారి జావిద్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం భూమి కలిగి అర్హత ఉన్న ప్రతి కుటుంబానికి రూ. 2 లక్షల పంట రుణమాఫీ చేయనున్నట్లు పేర్కొన్నారు. లక్ష వరకు ఉన్న రుణాలను మాఫీ చేసి రైతుల అకౌంట్లలో జమ చేయనున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా జిల్లాలోని రైతువేదికల్లో రుణమాఫీ సంబురాలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

అక్బర్‌నగర్‌లో వన మహోత్సవం

రుద్రూర్,జూలై 17: వన మహోత్సవంలో భాగంగా మండలంలోని అక్బర్‌నగర్‌లో ఉన్న ప్రభుత్వ పాఠశాల ఆవరణలో ఎస్సై అప్పారావు సిబ్బందితో కలిసి బుధవారం మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి పర్యావరణాన్ని పరిరక్షించాలని సూచించారు. కార్యక్రమంలో సిబ్బంది సాగర్, మహేశ్, గ్రామ పెద్దలు మారుతీ గౌడ్, కిష్టయ్య తదితరులు పాల్గొన్నారు.

జిల్లా దవాఖాన నుంచి రోగి అదృశ్యం

వినాయక్‌నగర్, జూలై 17: నిజామాబాద్ జిల్లా ప్రభుత్వ దవాఖానలో అడ్మిట్ అయిన ఓ వ్యక్తి అదృశ్యమైనట్లు ఒకటో టౌన్ ఎస్‌హెచ్‌వో విజయ్‌బాబు బుధవారం తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. కామారెడ్డి జిల్లా పాల్వంచ మండలం,ఎలుపుగొండ గ్రామానికి చెందిన మంగలి సంగయ్య(50) అనారోగ్యంతో బాధపడుతూ నాలుగు రోజుల క్రితం నిజామాబాద్ ప్రభుత్వ దవాఖానలో చేరాడు. ఈ నెల 16న ఉదయం 7.30 గంటల సమయంలో బాత్‌రూంకు వెళ్లొస్తానని తన భార్యకు చెప్పి వెళ్లాడు. ఎంత సేపయినా రాకపోవడంతో చుట్టు పక్కల వెతికినా ఆచూకీ లభించలేదు. దీంతో ఆమె పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా మిస్సింగ్ కేసు నమోదు చేసినట్లు ఎస్‌హెచ్‌వో విజయ్‌బాబు తెలిపారు. సదరు వ్యక్తి ఆచూకీ తెలిసిన వారు 87126-59837 నంబర్‌కు సమాచారం అందించాలని ఆయన సూచించారు.

సంక్షిప్తంగా..

- **గుర్తు తెలియని మహిళ మృతదేహం లభ్యం** - మాక్లూర్, జూలై 17: మండలంలోని దుర్గానగర్ కింది తండా రిక్వెస్ట్ బస్‌స్టాప్ వద్ద గుర్తు తెలియని యాచకురాలు (75) అనారోగ్యంతో మృతి చెందినట్లు ఏఎస్సై గంగాధర్ బుధవారం తెలిపారు. ఎరుపు తెలుపు రంగు డబ్బాల నైటీ ధరించిందని, మృతదేహం గుర్తు పట్టేందుకు వీలు లేదని పేర్కొన్నారు. కేసు నమోదు చేసుకుని మృతదేహాన్ని ప్రభుత్వ దవాఖానకు తరలించామని పేర్కొన్నారు.
- **కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులు మంజూరు** - రెంజల్, జూలై 17: మండలంలో 74 మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను ప్రభుత్వం మంజూరు చేసినట్లు తహసీల్దార్ శ్రావణ్‌కుమార్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. లబ్ధిదారులకు త్వరలో ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి చెక్కులను పంపిణీ చేస్తారని తహసీల్దార్ పేర్కొన్నారు.
- **వీడీసీ కార్యవర్గం** -మాక్లూర్, జూలై 17: మండల కేంద్రంలో వీడీసీ కార్యవర్గాన్ని బుధవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు అధ్యక్షుడు వినోద్ తెలిపారు. కోశాధికారిగా వినోద్, సభ్యులుగా రవి, శ్రీధర్‌గౌడ్, సుధాకర్, లచ్చన్న, సాయన్న, ముత్తెన్న, సత్యనారాయణ, రాందాస్, మహేశ్, రాజు, హబీబ్, గంగాధర్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు తెలిపారు.
- **పోస్టర్ల ఆవిష్కరణ**-నందిపేట్, జూలై 17: ఈనెల 26, 27, 28 తేదీల్లో హైదరాబాద్‌లో నిర్వహించనున్న ఫొటో ట్రేడ్ ఎక్స్‌పో పోస్టర్లను మండల కేంద్రంలో ఫోటోస్టూడియో అసోసియేషన్ సభ్యులు బుధవారం ఆవిష్కరించారు. తెలంగాణ ఫొటో అండ్ వీడియోగ్రాఫర్స్ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించనున్న కార్యక్రమాన్ని ఫొటో అండ్ వీడియో గ్రాఫర్లు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు వేముల శ్రీనివాస్, మండల ఫొటో స్టూడియో అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.
- **విద్యుదాఘాతంతో పాడి గేదె మృతి**- మాక్లూర్, జూలై17: మండలంలోని గొట్టుముక్కలలో బుధవారం విద్యుదాఘాతంతో పాడి గేదె మృతి చెందినట్లు బాధితుడు గొల్ల మహిపాల్ తెలిపాడు. ఉదయం మేత మేసేందుకు గ్రామ శివారులోకి వెళ్లిన గేదెకు తెగి పడిన విద్యుత్ వైర్ తగలడంతో అక్కడి కక్కడే మృతి చెందిందన్నారు. దాని విలువ రూ.90 వేలు ఉంటుందని పేర్కొన్నారు. విద్యుత్ అధికారులకు ఫిర్యాదు చేసినట్లు బాధితుడు తెలిపాడు.
- **సౌత్ రేంజ్ ఇన్‌చార్జిగా ఇందల్‌వాయి ఎఫ్ఆర్‌వో** -వినాయక్‌నగర్, జూలై 17: నిజామాబాద్ అటవీ శాఖ పరిధిలోని ఇందల్‌వాయి ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ రవిమోహన్ భట్‌కు నిజామాబాద్ సౌత్ రేంజ్ ఇన్‌చార్జిగా బాధ్యతలను అప్పగించారు. ఈ మేరకు డీఎఫ్‌వో బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. నిజామాబాద్ సౌత్ ఎఫ్ఆర్‌వో గా ఉన్న రాధిక రెండు నెలల పాటు వ్యక్తి గత సెలవుపై వెళ్లారు. దీంతో ఇందల్‌వాయి ఎఫ్ఆర్‌వోకు అదనంగా నిజామాబాద్ సౌత్ బాధ్యతలు అప్పగించారు.
- **లయన్స్ క్లబ్ జోన్ చైర్మన్‌గా తులసీదాస్** -ఖలీల్‌వాడి, జూలై 17: లయన్స్ క్లబ్ ఆఫ్ నిజామాబాద్ పూర్వ అధ్యక్షుడు సకినాల తులసీదాస్ 2024-25 సంవత్సరానికి లయన్స్ క్లబ్ జోన్ చైర్మన్‌గా ఎన్నికయ్యారు. ఈ మేరకు జిల్లా గవర్నర్ నగేశ్ బుధవారం నియామకపత్రాన్ని అందజేశారు.
- **తైక్వాండోలో జిల్లా విద్యార్థికి గోల్డ్‌మెడల్** - ఖలీల్‌వాడి, జూలై 17: జాతీయ స్థాయి త్వైకాండో చాంపియన్ షిప్ పోటీల్లో జిల్లా కేంద్రానికి చెందిన ఈగ రూపేశ్‌రెడ్డి (తొమ్మిదో తరగతి) గోల్డ్‌మెడల్ సాధించాడు. విద్యార్థిని వినాయక్‌నగర్‌లోని పాఠశాల స్కూల్‌లో ఉపాధ్యాయులు అభినందించింది.

రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి మృతి

నవీపేట, జూల